# తేడా

నిన్నమాపటేల[1] కోతలు ఖాయం చేసినట్టు దండువారు[2] ఏసినప్పట్నించీ ఓబిగానికి భయమెత్తుకున్నాది. తెల్లవార్తే తనగతి ఎట్టుంటాదో తల్చుకునే కొద్దీ రాత్రి నిద్దరే పట్టలా. అంబలి ఓబిగాడు ఈ ఏడుబాగా ఇబ్బందుల్లో ఇరుక్కున్నాడు. సరిగ్గా కోతలొచ్చేసరికి పెండ్లాం ఏడో కాన్పుకొచ్చింది. ఈ ఏడుకాన్పుల్లోనూ నాలుగు కాన్పులు కోతలప్పుడే వచ్చినాయి. "ఒసే లచ్చీ! పనులకాలంలో కానుపంటూ పండుకోకపోతే, దాన్ని ఎండాకాలంలోకి మార్చుకోయే! దొంగ గొడ్డు గడ్డికాలంలో యీనిందని........." అని తిడతాడు.

"నేనెంజేసేది? నాకు జెప్పడం గాదు, నువ్వు తెలివి తెచ్చుకోవాల్రా ముదనష్టపోడా" అంటుంది లచ్చి. పెండ్లాం యీవరస తప్పడం[3] లేదు. పెద్దకొడుకు వూళ్ళంబడి పోయినాడు యీమయ్య ఎనకంబడీ తిరుగుతాండాడనీ, పలక వాంచడంలో మొనగాడైనాడనీ అంటాండారు. సిన్నకొడుకు క్కాయిలా. సిన్న బిడ్డను పంపమని మొత్తుకున్నా ఆ అత్తముండపంపలా "మాకూ పనులకసాల వుండ్లా?" అంది. పెద్దబిడ్డ వచ్చిందిగానీ, లేవలేన్ది, నెలలైనాయి. తనొక్కడు ఎందరికనిపోతాడు? కూలిముంతలోళ్ళు అందరూ తగులుకుంటారు. అందుకే "ఈ రాతిరిగాన్నీ తెల్లవారకుంటే సోమీ" అనుకున్నాడు.

ఏ సోమిని అడిగినాడో తెలీకనేమో ఏ సోమీ తెల్లవారకుండా ఆపలేదు. తెల్లవారేలోగా ఓబిగాడు, చాలా రకాలుగా చచ్చిపోయినాడు. కొట్టానికి నిప్పంటుకుని, పెండ్లాంపిల్లల్తో గూడా కాలి బూడిదయినాడు. నడికొప్పుదూలానికి తాడు ముడేసి గొంతుకు బిగిచ్చుకుని వూగినాడు. నిద్దర్లో అట్టనే నీలుక్కొని చచ్చిపోయినాడు. తనుసావలేదనీ, బతికే వుండాడనీ తెల్చేసరికి ఇగ పొద్దున తను సావడం ఖాయం అనుకున్నాడు. అట్టసచ్చివుంటే, ఇట్టసచ్చేది తప్పేది అనుకున్నాడు. ఎట్టనుకున్నా జరిగేది తప్పలా. మసకమసక చీకటి వుండగానే, ................ " ఒరే ఓబిగా! తెల్లవారింది, లెయ్‌రా నాకొడకా! ఇంగా ఎచ్చంగా పండుకున్నావా?" అంటూ ఈశ్వెర్రెడ్డి తడికవాకిల్ని తన్నినాడు. ఉలికి పడిలేచి, వచ్చినాడు ఓబిగాడు. "ఏరా!

1. పొద్దుగూకేవేళ, 2. దండోరా, 3. తప్పెట

యీ రోజు కోతలనితెల్దూ?"

"అవు. తెల్చు..........." తలూపినాడు.

"మల్ల......... నాకొచ్చే దెవరు?" అని అడిగినాడు ఈశ్వెర్రెడ్డి. ఎవరొస్తారని చెబుతాడు? పెండ్లామా? పెద్దకూతురా? కొడుకా? సన్నపిల్లోల్లా?

"ఏం? ఇనపల్లా?" ఈశ్వెర్రెడ్డి చేతిలో వున్న ముల్లుకట్టెతో ఓబిగాని భుజం మీద తట్టడిసినాడు. 'ఎవరూ రారు' అంటే, అదే ముల్లు గట్టెయీపు పగల గొట్తాదని వానికి తెల్చు. "నేనే ఇంగ ........ ఎవర్నన్న నీకంపుతానా?" అన్నాడు సావునవ్వునవ్వుత్తూ.

"మల్ల, రడీగా వుండు" అంటా, లోపలి ఇండ్లల్లోకి పోయినాడు ఈశ్వెర్రెడ్డి.

ఓబిగాడు అట్టా నిలబడీ పోయినాడు.

"ఏంరోయ్! నిలబడుకోని నిద్దర పోతాండావా?" ఎదురుగ్గా మాడిమిద్దె సుబ్బిరెడ్డి. ఓబిగాడు నెత్తిగోక్కున్నాడు. "ఏం? ఎవరు?" అడిగినాడు సుబ్బిరెడ్డి.

"నేనే ఇంగ ....... ఎవరన్నా ........."

"సరే, తయారుగా వుండు" అంటా పోయినాడు సుబ్బిరెడ్డి.

"ఏంరో...... ఓబిగో" అంటా వచ్చినాడు సావిటికాడి సంజిరెడ్డి. ఓబిగాడు బదులుగా చేతులు పిసుక్కున్నాడు. "ఎవరు?" అడగను కూడా అడగలా. అట్టాకండ్లెగరేసినాడు. సంజిరెడ్డి. "నేనే......." ఓబిగాడు కూడా కండ్లతోనే చెప్పినాడు. సొలకోలు విసురుకుంటా పోయినాడు సంజిరెడ్డి. అబ్బిరెడ్డి పండ్లు తోముకుంటా, బొగ్గుకార్సుకుంటా వచ్చి........ "ఊ ......" అని సైగజేసినాడు. "ఎవరూ?" అన్నట్టు ఎడం చెయ్యి వూపి అడిగి నాడు. "ఊ...... ఊ......" అని ఓబిగాడు. 'నేనే' అన్నట్టు చెయ్యూపుతూనే చెప్పినాడు.

ఓబిగానికి ఒక తట్టు నవ్వూ ఒకతట్టు ఏడుపూ వస్తాండాది. ఒక్కడు ఇంతమంది పనికి ఎట్ట బోతాడు? ఒక్కరికే బోతాడు. అయితే, ఆసంగతిజెప్తే, ఆ ఒక్కడు పోను మిగతా అందరూ కల్చి తన్నుతారు. రేపు మాత్రం వాళ్ళు తన్నరా అంటే, రేపు సంగతి రేపు. ఇప్పుడు తన్నులు తప్పిచ్చుకుంటేసాలు. రేపు ఇంగొకరికి పోవొచ్చు. మన్నాడు ఇంగొకరికి పోవచ్చు. అట్టా సెప్తే ఇనరు. అందరూ 'నాకేరా' 'నాకేరా'అంటారు. "రాకుంటే నా బాకీ కట్టు" అంటారు. తనపనికి రాకుండా పక్కనోని పనికి పోతే ఓర్వలేరు. పక్కనోనికి

పోకుండా తనకే వస్తే బాగుంటాది. సేలల్లోకి పోయే టప్పుడు ఎవరికి ఎక్కువమందికూలోళ్ళు వస్తే, వాళ్ళకు గొప్పగా వుంటాది. అది కూలోళ్ళలో తనపలుకబడి బాగున్నట్టు లెక్క. ఎక్కువ మందిని పిల్చుకోలేక పోతే, ఇంట్లో ఆడోళ్ళు కూడా ఎగతాళిచేస్తారు. "నీ మొగానికి కూలోళ్ళు పలుకుతారూ?" అంటారు. అందుకని కూలోళ్ళను కొట్టో, తిట్టో, బాకీ కట్టమని బెదిరిచ్చో ఎక్కువ మందిని పిల్చుకోవాలి.

మాల,మాదిగ కూలోళ్ళు రైతులందరికీ అంతో, ఇంతో బాకీలు పడేవుంటారు. ఏడాదిలో గట్టిగాపనులుండేదీ, అందరికీ పనులు దొరకేదీ అయిదారు నెల్లే. మిగతా కాలమంతా ఎట్టబతకాల? ఎండాకాలంలో నైతే, ఎక్కడన్నా కట్ట బొయ్యనో, నట్టు తొగనో ఒకరిద్దరు మొగోళ్ళకు పనిదొరుకుతాదేమోగానీ....... ఆడోళ్ళకు పనివుండదు. అందరూ పనికి పోతేనే ఏపూట కాపూటకు సాలనప్పుడు, పనుల్లేకపోతే ఎట్టబతకాల? సావకుండా ఎట్టనో కట్టబతకాల్నంటే, రైతులగ్గర అప్పుజేసుకోవాల్సిందే. వాళ్ళు ముంతెడు గింజ లేస్తే, ఒక కూలిలెక్కన కట్టుకుంటారు. అది కూలోళ్ళకు సావకుండా బతకడానికి పని కొస్తే, రైతులకింకోరకంగా పనికొస్తాది. పనులకసాలా వుండేటప్పుడు కూలిపెరిగిన్నా, బాకీ లుండే వాళ్ళు ఎక్కువ అడగడానికి వీల్లేదు. ఎండాకాలంలో తెచ్చుకున్న ముంతెడు గింజలకు ఒకకూలి లెక్కన తీర్చాల్సిందే. అంటే, గింజలకు రెండింతలు వొడ్డీ గిట్టినట్టు! పైగా "నీకవసరం అయినప్పుడు ఇచ్చినానుగదా, నాకు అవసరం అయినప్పుడు, నువు రావాల గదా!" అని నిలదీయొచ్చు. తిట్టొచ్చు. బాకీ కట్టమని తన్నొచ్చు. ఇదంతా తెల్చినా, కూలోళ్లు బాకీలు సేస్తూ వుండాల్సిందే. తిట్లూ, తన్నులూ తినాల్సిందే. కొందరు అక్క నమ్మన్నూ, ఆల్నీ తిడతారు! ఇంగకొందరు ఆల్నీ ఇడిసిపెట్టి ఆ ఇద్దర్నీ తిడ్తారు! రైతుల్లో తిట్లు తినని మాలమాదిగోడుండడు. మాల, మాదిగోల్లని తిట్టని రైతుండడు.

కరకర పొద్దుపొడిచింది.. ఓబిగాడు ఆలోచన చాలించి కొట్టంలోకి దూరినాడు.

"ఎవరికి బోతావు?" అడిగింది లచ్మి.

"ఈశ్వెరరెడ్డికి పోతే, సంజిరెడ్డికి కోపం, సంజిరెడ్డికి పోతే ఈశ్వెరరెడ్డికి కోపం. ఎట్ట సెయ్యాల్నో"

"కానుపయి రెండోరాలయిందిగదా. పిల్లను నాగి సూత్తాది. నేనొకరికి పోతా, నువ్వొకరికి పో" అంది లచ్మి.

"పచ్చిపెయితో మాపటేలదాకా యాడుంటావ్?"

"అమ్మా, నే బోతానే" అంది నాగి.

"తొమ్మిదో నెల. నువ్వుపనికిబోతే ఇండ్లల్లో అందరూ మా మొకాన ఎంగిలిమూత్నారు" అంది లచ్చి.

"మొదుళ్ళ కోతగాదు. నిలబడుకోని జొన్నకంకులు కోసేదే గదా! పరవాలేదు లేయే, పోతాను"

"వద్దు లేమ్మా........... నెల్లో నొప్పులొస్తే ఎట్టా! నేను ఎవరికో ఒకరికి పోతాను. తిడ్తే తిడ్తారు. మనకు మామూలేగదా" అన్నాడు ఓబిగాడు.

"నొప్పులప్పుడే రావులే, ఇంగా పదిరోజులుండాల" అని కొట్టేసింది నాగి.

★ ★ ★

నిలువెత్తునున్న జొన్నకర్రలు. కూలోళ్ళు తమ తలలమీదున్న కంకుల్ని కొయ్యడం ఇష్టం లేనట్టు. అందకుండా తలలెత్తుకున్నట్టు నిల్చున్నాయి. కొడవల్తో ముందు కర్రను వంచి, ఆ తర్వాత కంకిని కోసుకోవలసి వస్తోంది. కంకులు కోసిన కర్రలు బోసిగావున్నాయి. కంకులు లేని కర్రలు నొప్పితో తలలు విదిలించుకుంటున్నట్టుంటే, కంకులున్నవి గర్వంతో తలూపుతున్నట్టు గాలికి కదుల్తున్నాయి. దట్టంగా వున్న జొన్నచేలో, చురుక్కు మంటున్న ఎండలో మెడకుతగిలించుకున్నగోనె సంచితో నాగికి వూపిరాడనట్టు అనిపిస్తోంది. ఎసర్ల పొద్దుదాకా ఎట్టనో మునంలో నిలబడుకోని కంకులు కోస్తానే వుండింది గానీ, రెండు కాళ్ళ మీదానిక్కి చేతులు సాచి కర్ర నొంచే సరికి, కడుపులో నొప్పులు మొదలైనాయి. ఎంతో సేపు పండ్లబిగువున ఓర్చుకోని వుండి వుండి, వల్లగాక 'అమ్మా!' అంటఅరిచి, కూలిపోయింది. కూలోళ్ళందరూ పరుగెత్తి వచ్చినారు. నాగికి నొప్పులొస్తున్నట్టు ఆడోళ్ళ కర్థమయింది. ఎత్తుకోని పోయి జొన్న చేను పక్కనున్న కందిసాలు కింద పండుకో బెట్టినారు. కూలోళ్లు మునంలో నుంచీ పక్కకు బోయింది, గట్టు మీద చెట్టుకింద కూర్చొనున్న మాడి మిద్దె సుబ్బిరెడ్డి కనిపెట్టినాడు.

"ఏందర్రోయ్! అందరూ యాడికి పోతాండారు? " "కోతయిపోకపోతే పొద్దుగుంకినా పోనియ్యను. ఏమనుకుంటాండారో" అని కేకేసినాడు. "నాగికి నొప్పులుదాని కొక్కదానికేనా? మీకందరికీ ఎత్తు కొన్నాయా? రండశా......... పన్లోకొంగండి. దానికేం........ పండుకునుంటాదిలే. ఈ పొద్దు పనిసెడగొట్టడానికొచ్చినట్టుంది. నొప్పులొచ్చేది ఎందుకురావాల? వచ్చింది ఇంటికి

బ్బొయ్యే దాకా వుండాల, ఇప్పుడు పని సెడగొడ్తే ఎట్ట? సేను కొదవబడ్తే. రాత్రికి ఎవరన్నాకోసుక పోతే ఎట్టా?" ఇట్టా సుబ్బిరెడ్డి తిడుతూనే వున్నాడు. ఆడవాళ్ళు వంతులేసుకుని నాగిని చూసివస్తున్నా తిడుతున్నాడు.

"దానికి నొప్పులొచ్చినాయి, అదికంటాంది. నువ్వెందుకక్కడ? రా......." అని కేక లేస్తున్నాడు. సుబ్బిరెడ్డి తిట్లు తింటూనే వాళ్ళు నాగిదగ్గరకు పోతూ, వస్తూ పని చేసినారు. ఓ గంటకల్లా బిడ్డ ఏడుపువినిపించింది. బాలి చేతి కొడవల్తోనే బొడ్డు కోసింది. నాగి మాగన్నుగా పడిపోయివుంటే, బిడ్డను ఏ తోడేలో ఎత్తుక పోకుండా కాపలాకాసినారు. చీకటి పడేసరికి చేను కోతయింది. అప్పుడు కంకులకోసం వచ్చిన బండ్లో నాగినీ బిడ్డనూ పడుకోబెట్టుకోని ఆడకూలోళ్ళు వూరు చేరుకున్నారు. "ఏందర్సారా దాన్ని .... పని సెడగొట్టింది కాక, బండ్లో వూరేగుతా వూరుసేర్తాంది" అని, నవ్వుతూ అన్నెట్టు అన్నాడు సుబ్బిరెడ్డి.

★ ★ ★

ఇంటి కొచ్చేసరికి సుబ్బిరెడ్డి కూతురుకూ ఆడపిల్ల పుట్టివుంది. కాన్పుకావడం ఆలస్యమయ్యేసరికి, నాటు మంత్రసాన్ని నమ్ముకోకూడదని, సుబ్బిరెడ్డి కొడుకు ప్యాటకుబొయి కార్లో డాక్టర్‌ను తీసుకొచ్చినాడు. వూర్లో ఆడోళ్ళంతా సుబ్బిరెడ్డి ఇంటి కాడుండారు. 'పాపం! బిడ్డ శానాకట్టపడింది' అని సుబ్బిరెడ్డీ,. సుబ్బిరెడ్డి భార్యా వినేటట్టు మాట్లాడుకుంటున్నారు. అన్నాలు తినే వేళకు అందరూ ఎవరిండ్లకు వాళ్ళు బొయినారు. అప్పుడొచ్చినాడు ఓబిగాడు.

"పదిరూపాయలు లెక్క, నాలుగు ముంతలు గింజలూ ఇయ్యిసోమి! నాగి తీర్తమాడింది. గబ్బునూనెకూ, సమురుకూ కావాల" అని బంగపడినాడు. కోతకు వాడుగాకుండా కూతుర్నంపినందుకూ, అది పని సెడగొట్టినందుకూ.... మల్లాతిట్టినాడు సుబ్బిరెడ్డి. ఆయన్నీ అయినాక "దీపాలు పెట్నాక లెక్క ఇయ్యను" అన్నాడు. ఓబిగాడు అట్టనే కూర్చున్నాడు. సుబ్బిరెడ్డి అన్నంతినొచ్చి, అట్టనేకూచొనున్న ఓబిగాన్ని చూసి మల్లా తిట్టినాడు. "మొండినాకొడకా? నాదగ్గర్నే మొండికి పడతావేంది? వూర్లో ఇంగెవరూ లేరా? " అన్నాడు. ఓబిగాడు తన అవసరం కొద్దీ, వూర్లో వున్నవాళ్ళలో ఎవరూ మాడిమిద్దెసుబ్బిరెడ్డి అంత దర్మాత్ములు లేరన్నట్టు మాట్లాడినాడు. దాన్తో, మెత్తబడినాడు సుబ్బిరెడ్డి. ఇంట్లోకి బోయి పదిరూపాయలలెక్క, గింజలూ తెచ్చినాడు.

"ఇయ్యాలప్పుడు ఏందియీనిపీడ?" అంటా వచ్చింది. ఇంట్లోంచీ యీరమ్మ.

"యీమె ఒకతి" అనుకుని, ఓబిగాడు ఆమైనూ మెత్తబర్చాలని చూసినాడు.

"మనవరాలు పుట్టిందంటగా అమ్మా. ఈ పొద్దేనాకూ మనవరాలు పుట్టింది. మన సేలోనే నాగి తీర్తమాడింది." అన్నాడు.

సుబ్బిరెడ్డికి కోపమొచ్చింది.

"సరేలే....... ఇంగ, ఫో........ ఫో" అంటూ పదిరూపాయల లెక్కా విసరేసి, గింజలు వొళ్ళో పోసినాడు.

అవునుమరి, ఒక్కసారే పుడ్తేమాత్రం మాదిగ ఓబిగాని మనవరాలూ, మాడిమిద్దె సుబ్బిరెడ్డి మనవరాలూ ఒకటేనా? వాళ్ళను పోల్చేదేనా?

*(28-6-'72 'ఆంధ్రప్రభ' వారపత్రిక లో ప్రచురితం)*

# -- కథ గురించి. . .

ఈ కథ 'తెల్లార్తే భయపడేవాళ్ళు' అన్న పేరుతో అచ్చయింది. ఇప్పుడు కథ చదివిన తర్వాత 'తేడా' అన్న పేరు బావుంటుందనిపించింది. 'తెల్లవారితే ఎవరిపనికి పోవాలా?' అని భయపడుతుంటారు కాబట్టి, వాళ్ళను 'తెల్లార్తే భయపడే వాళ్ళు ' అని వుంటాను. 'తెల్లవారడం' అన్నదానికి ఇంకో అర్థమూ వుంది. అదలావుంచినా, వాళ్లు తెల్లవారితే ఎందుకో భయపడుతుంటారనే సూచనవస్తూ, వాళ్ళ సమస్యలను మరుగు పరచి వాళ్ళనో కేరికేచర్లలాగా చూపిస్తున్నట్టు అనిపించి, ఆపేరు మార్చాను.

* ఇప్పుడు అటువంటి పరిస్థితి వుండక పోవచ్చునేమో కానీ, ఒకప్పుడు ఆమని కాలంలో (అంటే పంటలకాలంలో) మావూళ్ళో కూలీల (ముఖ్యంగా హరిజనుల) పరిస్థితి అంత దారుణం గా వుండేది. ఆ పరిస్థితిని 'రికార్డు' చేసింది యీకథ. "కాలం మారింది"